క్లుప్తంగా

అమ్మ ఫౌండేషన్ ఆర్థిక సాయం



భాగమ్మకు నగదు సాయం చేస్తున్న వెంకటేశ్వర్లు యాదవ్

కొమరోలు: మండలంలోని తాటిచెర్లలో నివాసం ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు సాయం అందజేశారు. అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తాటిచెర్ల గ్రామానికి చెందిన పల్లాల భాగ్యమ్మ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న వీరు 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు నాగార్జున, రవితేజ, వెంకటస్వామి, తిరుమలయ్య పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవి దళితులకు ఇవ్వాలి

దర్శి: ఏఎంసీ చైర్మన్ పదవిని దళిత సామాజిక వార్గానికి చెందిన రాచపూడి మోషేకు ఇవ్వాలని దళిత సేన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం తీర్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీల్లో అనేక సామాజిక వార్గాల వారు పని చేశారు కానీ ఎస్సీలకు మాత్రం కేటాయించలేదని చెప్పారు. టీడీపీలో సుదీర్ఘకాలంగా పని చేసిన విద్యావేత్త రాచపూడి మోషేను నియమించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ గంథం ఇర్మియా మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయకుండా మానవతా దృక్పదంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆదిమలపు రవి, ఉలస రవి, మల్లెల జాన్‌ప్రసాద్, వైవీరెడ్డి, నాగేశ్వరరావు, రమేష్, కోటేష్ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌కు ఘన సన్మానం



వెల్ఫేర్ ఆఫీసర్‌తోపాటు వాచ్‌మెన్‌ను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

తర్లుపాడు: స్థానిక ఎస్సీ, ఎస్టీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటరెడ్డిని జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు విద్యార్థుల సమగ్రాభివృద్ధి, క్రమశిక్షణ, ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ వహించి వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా తీర్చిదిద్దారని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసిన బీజేపీ

చీమకుర్తి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు విమర్శించారు. ఫలితంగానే ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ నైతిక ఓటమి పొందిందన్నారు. శుక్రవారం చీమకుర్తిలో నిర్వహించిన సీఐటీయూ మండల కమిటీ సమావేశానికి కాలం సుబ్బారావు హాజరై మాట్లాడారు. ఇప్పటికైనా రైతులు, కార్మికుల పట్ల కేంద్రం సానుకూలంగా ఉండే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. జయ మినరల్ క్వారీలో జరిగిన ప్రమాదంలో ఆనంద్‌బాబుకు చేయి తీసేయాల్సి వచ్చిందని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని క్వారీ యాజమాన్యాలకి విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు డీడీఎంఎస్ వచ్చి తూతూమంత్రంగా విచారణ చేపట్టకుండా క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు బీ ఓబులేసు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అందరూ చదవాలి.. అందనంత ఎత్తుకు ఎదగాలి



వైపాలెంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: నిరక్ష రాస్యులుగా మిగలకుండా అందరూ చదవాలని, అందనంత ఎత్తుకు ఎదగాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, విద్య తమ పిల్లలను మహోన్నత శిఖరాలకు తీసుకొని వెళ్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యలభిస్తుందని పేర్కొన్నారు. పిల్లలు బాగా చదువుకుంటే తల్లిదండ్రులకు అంతులేని ఆనందం కలుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కిట్స్, మధ్యాహ్న భోజనం లాంటి పథకాలు లభిస్తాయని చెప్పారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారంగా ఏర్పడి విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎంఈవో–2 మల్లూనాయక్, హెచ్‌ఎం వి.పిచ్చిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లో ఉండాలి

త్రిపురాంతకం: బడి ఈడు పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండాలని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించి విద్యార్థులను పాఠశాలలకు పంపాలని ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కేశినేనిపల్లిలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో బడి ఈడు పిల్లలని పాఠశాలలకు పంపాలని ర్యాలీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలకు రాని విద్యార్థులందరినీ ముందుగా గుర్తించాలన్నారు. పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. విద్యార్థుల సామార్థ్యాలను తల్లిదండ్రులెదురుగా పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి, సీఆర్‌పీ శ్యామ్‌రాజు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ హరీష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అతిసారంపై అవగాహనా ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

వాంతులు, విరేచనాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దదోర్నాల: విరేచనాలు, వాంతులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూపరింటెండెంట్ నాగ మహేశ్వరి కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేశారు. సూపరింటెండెంట్ నాగమహేశ్వరి మాట్లాడుతూ అతిసారానికి సంబంధించి జూలై ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు అతిసారాం నియత్రణ మహోత్సవాలు జరుగుతాయన్నారు. అతిసారం, వాంతుల నుంచి కాపాడుకునేందుకు ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్లు వాడాలని సూచించారు. ఎక్కువ సార్లు విరేచనాలు అవుతుంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలని సూచించారు. కాచిన చల్లార్చిన నీటిని సేవించాలని చెప్పారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఎక్కువగా నీళ్ల విరేచనాలు అవుతుంటే జింక్ ద్రవం తాపాలన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ ఎలిజెబెత్, ఫార్మసిస్ట్ పిచ్చిరెడ్డి, ఆరోగ్యమిత్రలు మందగిరి చంద్రశేఖర్, మణికుమార్, సాంబయ్య పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి, సమేత తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో పుణ్యక్షేత్రం గొ్ద్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 9వ రోజు శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, పూర్ణాహుతి, వసంతోత్సం, హారతులు తదితర పూజలు చేసిన అనంతరం స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం ప్రాంగణంలో అలంకరించిన హంస వాహనంపై ఉత్సవమూర్తులు కొలువై మంగళవాయిద్యాల నడుమ విహరిస్తూ భక్తులకు కటాక్షించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయదాతలు చట్లమిట్ల గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి కందుల వెంకటరెడ్డి, వాదంపల్లి గ్రామానికి చెందిన పెరుగుమల్లి వెంకటసుబ్రహ్మణ్యశర్మ, పవన్‌కుమార్‌శర్మ దంపతులు వ్యవహరించారు. శనివారం సాయంత్రం రాజంపల్లి గ్రామంలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మలేరియా వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రోహిత్ నాయక్, వైద్య సిబ్బంది



పొదిలిలో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

మార్కాపురం రూరల్/పొదిలి: మండలంలోని రాజుపాలెం గ్రామం క్రిస్టియన్‌పాలెంలో తిప్పాయిపాలెం పీహెచ్‌సీ డాక్టర్ రోహిత్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. మలేరియా బారిన పడకుండా ఉండాలంటే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ నాయక్ సూచించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ.. దోమతెరలు వాడాలని, వేపాకు పొగతో మలేరియా కారక దోమలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ విల్సన్, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

☛ పొదిలిలో శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవివేకానంద నర్సింగ్ కళాశాలలో డాక్టర శరత్ చంద్ర మాట్లాడుతూ.. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం విశ్వనాథపురంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ కె.మేరీనా, ఏఎన్ఎం కె.శార, మహిళా పోలీస్ శివరంజని, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కోసం కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉదయ్‌శంకర్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు కోసం సహకరించాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారీని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రకాశం జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారీని ఉదయ్‌శంకర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలో విలేకరులకు ప్రెస్‌క్లబ్‌కు లేకపోవడంతో ప్రజా సమస్యలపై సమావేశాలు నిర్వహించాలంటే ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. విలేకరులందరూ ఒకే చోట కూర్చునేందుకు ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో ఐసీడీఎస్ సిబ్బంది

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ సుధామారుతి మాట్లాడుతూ.. కేంద్రాల్లో పిల్లల మానసిక, శారీరక అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరేళ్ల పూర్తయిన పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపించే ప్రక్రియలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రథమ కోఆర్డినేటర్ ఎస్.వెంకట్, సూపర్‌వైజర్ సుభాషిణి, కార్యకర్తలు లక్ష్మీదేవి, విజయలక్ష్మి, సరోజ నిర్మల, నరసమ్మ, సునంద తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో వర్షం



మార్కాపురంలో వర్షం కురవడంతో మేఘావృతమైన ఆకాశం

మార్కాపురం టౌన్: గత మూడు రోజులుగా ఊరిస్తున్న వర్షం ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రం మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో కురిసింది. దీంతో పట్టణ ప్రజలు సేదతీరారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించరాదు



సీజ్ చేసి స్టేషన్‌కు తరలించిన ఆటోలతో ఎస్సై మహేష్

మద్దిపాడు: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించరాదని మద్దిపాడు ఎస్సై వి.మహేష్ స్పష్టం చేశారు. శుక్రవారం మండల పరిధిలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకున్న 7 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను నివారించడంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ప్రయాణికులు ఎక్కువ మంది ఉండకుండా చూసుకోవాలని డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటోలు, ఆటో డ్రైవర్లను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసి ఒంగోలు మొబైల్ కోర్టులో హాజరుపరిచారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



గ్రామోత్సవంలో ఉత్సవ విగ్రహాలు

కంభం: స్థానిక శీలం వీధిలోని రామాయలం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన రథంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చేసిన కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.


విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక హక్కులు



పాంప్లేట్‌ను ఆవిష్కరిస్తున్న కళావతి తదితరులు

మార్కాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులు కల్పించిందని, వాటిని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని నివేదిత స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బి.కళావతి పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో చైల్డ్ రైట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ల్యాంప్ సహకారంతో ప్రత్యేక ప్రతిభావంతుల హక్కులపై సమావేశం ఏర్పాటుచేశారు. ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు అనే పదాన్ని ఉపయోగించకూడదని, విభిన్న ప్రతిభావంతులు అని పిలవాలని సూచించారు. లాంప్ సంస్థ డైరెక్టర్ సాల్మన్ పాల్ మాట్లాడుతూ హక్కులనేవి ప్రతి ఒక్కరికీ సమానంగా ఉన్నాయని, అయితే వాటిని ఉపయోగించుకునే క్రమంలో విభిన్న ప్రతిభావంతులు వెనుకబడ్డారని, వారి అభ్యున్నతికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సంస్థ రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.సుబ్బాయమ్మ మాట్లాడుతూ.. 2016 దివ్యాంగుల చట్టంలో ఉన్న 21 రకాల హక్కుల గురించి వివరించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ వెంకటరామిరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. అనంతరం ఫాంప్లేట్‌ను ఆవిష్కరించారు.

గరుడ వాహనంపై పట్టాభిరాముడు



గరుడవాహనంపై సీతా లక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లిలోని సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ చేశారు. అర్చకులు ఓరుగంటి పవన్‌శర్మ, వెంకట ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి క్రతువులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. శుక్రవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శనివారం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

క్వారీలలో భద్రత కరువైందని ఫిర్యాదు

చీమకుర్తి: మండలంలోని రామతీర్థం పరిసరాలలో గల గ్రానైట్ క్వారీలు, డంపింగ్‌లలో భద్రతా ప్రమాణాలు పాటించటం లేదని క్వారీ యాజమాన్యంపై చీమకుర్తికి చెందిన బీజేపీ నాయకుడు గుండా శ్రీనివాసరావు డీడీఎంఎస్‌కు ఫిర్యాదు చేశారు. జయ మినరల్స్ క్వారీలో జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టడానికి వచ్చిన డీడీఎంఎస్ జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలన కార్మికులకు జరుగుతున్న ప్రాణాపాయాలను వివరించారు.

నేడు అభయాంజనేయస్వామి కళ్యాణం

ఒంగోలు రూరల్: పదో వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని కరవది గ్రామంలో గల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో నేడు కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహక సంఘం తెలిపింది. వేద పండితులు నారాయణం రామాచార్యులు, నారాయణం హనుమాచార్యులు శాస్త్రబద్ధంగా వేదమంత్రాల నడుమ ఉదయం 8 గంటలకు గణపతి పూజ, హనుమకలశ స్థాపన, పంచామృత అభిషేకం నిర్వహిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు సువత్సల హనుమ కళ్యాణం అనంతరం మంగళహారతులు, తీర్థప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ పాల్గొనాలని వారు కోరారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

మద్దిపాడు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ ఆధ్వర్యంలో మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని, నీటిని క్లోరినేషన్ చేయించాలని చెప్పారు. క్లోరినేషన్ చేసిన ఒక గంట తర్వాత నీటిని సరఫరా చేయాలని చెప్పారు. తద్వారా సీజనల్ వ్యాధులైన డయేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాలు రాకుండా నివారించవచ్చన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవి, సర్పంచ్ అనిల్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

పిల్లలంతా బడికి వెళ్లాలి

ఒంగోలు రూరల్: బడి ఈడు బాలబాలికలంతా బడికి వెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఒంగోలు ఎంఈఓ–2 సరస్వతి అన్నారు. మండలంలోని కరవది జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో శుక్రవారం బడికి పోదాం ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీనుద్దేశించి ఎంఈఓ–2 మాట్లాడుతూ బాలబాలికలు బడిలో ఉండాలని, బట్టీల వద్ద, వ్యవసాయ పనుల వద్ద ఎవరూ ఉండటానికి వీల్లేదని తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు జారీ అయ్యాయని, తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలలో చేర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, ప్రజాప్రతినిధులపై ఉందని తెలిపారు. మీ ఏరియాలలో బడికి పోకుండా తిరుగుతున్న బాలబాలికలను, పనులకు పోతున్న వారిని గుర్తించాలని వారికి సూచించారు. నూరుశాతం అడ్మిషన్లు ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, కిట్లతోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం రవికుమార్ మాట్లాడుతూ నూరుశాతం అడ్మిషన్లు సాధించే దిశగా తమ ఉపాధ్యాయులు, కాలేజీ లెక్చరర్లు కృషి చేస్తున్నారని తెలిపారు. డ్రాపవుట్ లేకుండా చూడటమే ప్రథమ లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.